క్లుప్తంగా

19న మెగా ఉచిత వైద్య శిబిరం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో కిమ్స్ - సన్‌షైన్ హాస్పిటల్స్ సహకారంతో ఈనెల 19న శుక్రవారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మెడికల్ అండ్ హెల్త్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ కొండ శ్రీనివాస్, కె.ఉదయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కాచిగూడలో వారు మాట్లాడుతూ.. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పల్మోనాలజీ, కార్డియాలజీ విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొని రోగులకు ఉచిత వైద్యసేవలు అందిస్తారన్నారు. బీపీ, షుగర్, ఆర్‌బీఎస్, బీఎండీ, వెయిట్ చెక్, హైట్ చెక్, ఈసీజీ, లంగ్స్ ఫంక్షన్ టెస్ట్ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అవసరమైన వారికి మందులను కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి ఎమ్మెల్యే..



అంబర్‌పేట: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆయన సతీమణి పద్మతో కలిసి తిరుమల తిరుపతి శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం వారి వివాహ దినోత్సవం సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు.

కొనసాగుతున్న సీఎం కప్ టోర్నమెంట్



దోమలగూడ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల మైదానంలో..

కవాడిగూడ: సీఎం కప్ టోర్నమెంట్‌లో భాగంగా దోమలగూడలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వివిధ క్రీడలను జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో క్రీడలను ఆయా క్రీడల కోచ్‌లు సీహెచ్ రాజారావు, కృష్ణ, విజయానంద్, మనోజ్‌రెడ్డి, పవన్ శుక్ల, మహేష్, ప్రభాకర్, జీహెచ్ఎంసీ కోచ్‌లు కేఆర్ విజయానంద్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు కిషోర్ కుమార్, కేఎస్ హెలెన్, పరిమళ సమక్షంలో ఆడించారు. అనంతరం స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తోందన్నారు. క్రీడాకారులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా జీహెచ్ఎంసీ తగిన ఏర్పాట్లు చేసిందన్నారు. ముషీరాబాద్, హిమాయత్‌నగర్ మండలాల క్రీడాకారులకు క్రీడలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

చిక్కడపల్లి: సినీరంగంలో విభిన్న పౌరాణిక పాత్రలకు ప్రతి రూపంగా నిలిచిన ఏకైక నటుడు, సంచలన రాజకీయ నాయకుడు నందమూరి తారకరామారావు అని ఆయన శత జయంత్యుత్సవంలోనైనా కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ప్రకటించాలని ప్రముఖులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో ప్రముఖ సాంస్కృతిక కళా నిలయం నిర్వహణలో ఎన్టీఆర్ శత జయంతి మహోత్సవం జరిగింది. ఎన్టీఆర్ పురస్కారాలు నటులు గుండు సుదర్శన్, భవానీ శంకర్, నాయకుడు కథానాయకుడు గ్రంథ రచయిత నవీన్‌లకు బహూకరించారు. ప్రఖ్యాత గాయని జిక్కి కుమార్తె హేమలతకు ఘంటసాల ఎన్టీఆర్ పురస్కారం ప్రదానం చేయగా.. వంశీరామరాజు సభకు అధ్యక్షత వహించారు. సాయిబాబా, బాలరాజ్‌గౌడ్, రవీంద్రాచారి, కళా పోషకులు ఏంవీరావు , బద్రినాథ్, ప్రతాప్‌కుమార్, రామచంద్రరావు సంస్థ కార్యదర్శి సురేందర్, బాపిరాజు, పుష్పలత పాల్గొన్నారు.

డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్యల పరిష్కారానికి కృషి

చిక్కడపల్లి: డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్యలను పరిష్కారించేందుకు కృషి చేస్తానని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్‌లోని గోల్కొండ క్రాస్‌రోడ్స్ సమీపంలోని హెబ్రోన్ చర్చి ఎదురుగా ఉన్న మ్యాన్‌హోల్ పూర్తిగా దెబ్బతినడంతో మట్టి నిలిచిపోయింది. ఈ సమస్యను వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, మల్లేష్‌లతో పాటు బీజేపీ యువనాయకులు ఎ.వినయ్‌కుమార్‌లతో ఆమె కలిసి పర్యవేక్షించారు.

వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు

- స్టీల్‌బ్రిడ్జి నిర్మాణంలో అవసరమైన యూటర్న్ ఏర్పాటు
- సాఫీగా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వెసులుబాటు



స్టీల్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: స్టీల్‌బ్రిడ్జి నిర్మాణంతో వ్యాపారులకు కలిగే ఇబ్బందులను నివారిస్తామని వ్యాపారాలు సాఫీగా సాగేలా వారికి అవసరమైన యూటర్న్, కాలిబాటలను చేస్తామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. మంగళవారం వ్యాపారుల కోరిక మేరకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే ముఠాగోపాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం ఇందిరాపార్క్ నుంచి నాగమయ్యకుంట వరకు స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ప్రధానంగా అశోక్‌నగర్ చౌరస్తా ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వరకు స్టీల్‌బ్రిడ్జి కింద ఉన్న వ్యాపారుల ఇబ్బందులను తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. బ్రిడ్జి కింద ప్లానింగ్ ప్రకారం మూడు యూటర్న్స్ రెండూ.. పాదచారులు వెళ్లే విధంగా కాలిబాట నిర్మాణం ఉంటుందని వివరించారు. వ్యాపారుల కోరిక మేరకు 5 యూటర్న్లు, 4 కాలిబాటలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు సమాచారం. పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని జూన్‌లో పనులు పూర్తి అవుతాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, ముఠా నరేష్, వ్యాపారులు, బీఆర్ఎస్ నాయకులు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, ఆనంద్, భాస్కర్, జహంగీర్, ఆనంద్, రవి, శంకర్‌గుప్తా తదితరులున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న దృశ్యం

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



ఒలింపియాడ్ ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

కవాడిగూడ: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి వారిలో కాంపిటీటివ్ స్పిరిట్‌తో పాటు అనలైటికల్ అప్లికేషన్ వివిధ రాకల నైపుణ్యం పెంపొందించే జాతీయ స్థాయి ఒలింపియాడ్‌లను నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సెమ్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ కన్వీనర్ రామచంద్రారెడ్డి, కో-ఆర్డినేటర్ ఎస్ఎన్ రెడ్డిలతో కలిసి ఎస్ఎస్ఎస్‌ఓ, ఎస్ఎస్ఈఓ, ఎస్ఎస్ఎస్ఓ, ఎస్ఎస్‌జీకెఓ, ఎస్ఎస్‌సీఎస్‌ల ఫలితాలను విడుదల చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రావీణ్య పురస్కార్, ఎలైట్ అవార్డులు నగదు రివార్డులు ఇచ్చి వారిని ప్రోత్సాహిస్తున్న వారిని మంత్రి అభినందించారు.

- ఒలింపియాడ్ అవార్డులు, నగదు రివార్డుల బహుమతుల ప్రదానోత్సవం జూన్ చివరి వారంలో నిర్వహించనున్నట్లు కన్వీనర్ రామచంద్రారెడ్డి, కో-ఆర్డినేటర్ ఎస్ఎన్‌రెడ్డిలు తెలిపారు.
- మొదటి మూడు ర్యాంకులు పొందిన వారికి వరుసగా రూ. 5వేలు, రూ.2500, రూ.1000 నగదు రివార్డుతో పాటు ప్రావీణ్యపురస్కార్ అవార్డులు మెమెంటో, సర్టిఫికెట్, 4 నుంచి 10 ర్యాంకులు పొందిన వారికి ఎలైట్ అవార్డులు, మెమోంటో, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. - ప్రతీ కేటగిరికి మొదటి 10 ర్యాంకులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఆత్మీయ సన్మానం చేయనున్నట్లు వివరించారు.
- ఒకే ర్యాంకు మీద ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది ఉంటే ఆ నగదును వారందరికీ షేర్ చేస్తామని తెలిపారు.
- ఈ రిజల్ట్స్ రిలీజింగ్ ప్రోగ్రామ్‌లో ట్రస్మా హైదరాబాద్ ఉపాధ్యక్షులు జయరాంప్రసాద్, సెమ్స్ టెక్నికల్ టీం రంజిత్, రాజేశ్వరి, చింతల రామచందర్, పీజేరెడ్డి, కె.అనంతరెడ్డి, శేఖర్‌రెడ్డి, అనిల్ కుమార్, రాఘవ, అనిల్‌కుమార్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

అంబర్‌పేట: ఐసీఎస్ఈ పదోతరగతి ఫలితాల్లో 9.8 గ్రేడ్ సాధించిన విద్యార్థి కార్తికేయను మంత్రి సబితారెడ్డి అభినందించారు.

దోమల నివారణపై అవగాహన



జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో దోమల నివారణపై నగరంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రామ్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంటమాలజీ విభాగం సీఈ రాంబాబు, ఎస్ఈ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.
– ముషీరాబాద్

కేన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మురళీ కృష్ణ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఇంటర్నేషనల్ వాకర్స్ రిజనల్ కౌన్సిలర్ ఎస్.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, ఎస్‌వీకే సంయుక్త ఆధ్వర్యంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి సహకారంతో మహిళలకు ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణ మాట్లాడుతూ.. కలుషిత ఆహారం, వాతావరణంలో మార్పు, ఆహారపు అలవాట్ల వల్ల నేడు రోజు రోజుకు కేన్సర్ బాధితుల సంఖ్య పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి దశలోనే కేన్సర్‌ను తెలుసుకుని డాక్టర్ సూచనల మేరకు మందులు వాడుతూ.. తగిన జాగ్రత్తలు తీసుకుంటే కేన్సర్‌ను జయించవచ్చన్నారు. 100 మంది మహిళలకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, ట్రస్ట్ ప్రతినిధి బుచ్చిరెడ్డి, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ సునీల్, మాజీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, నాగభూషణం, ఎంఎన్‌జే డాక్టర్లు సౌజన్య, వంశిక, శ్రీధర్‌రెడ్డి, శ్రీను తదితరులున్నారు.

బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శివనాగేశ్వర్‌రావు

కాచిగూడ: తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పేరం శివ నాగేశ్వర్‌రావును నియమిస్తూ.. మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలోని బీసీ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. జనగణనలో బీసీ కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేయించిన సీఎంకేసీఆర్ అభిలషాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. కాంగ్రెస్ సహా దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలు బీసీల కులగణనకు మద్దతును ప్రకటించినా.. బీజేపీ పట్టించుకోకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లును పెట్టి దేశ జనాభాలో 54 శాతం ఉన్న బీసీలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లను కల్పించాలనే అంశంపై కేసీఆర్ ప్రధాని నరేంద్రమోదీతో మాట్లాడాలని కోరారు. బీసీ మహాసభ నేతలు ప్రశాంత్ నిమ్‌కర్, నల్లెల కిషోర్, సీహెచ్ ప్రదీప్‌గౌడ్, భూషణ్ భాస్కర్, పులిజాల కృష్ణ తదితరులున్నారు.

ఆర్టీసీకి కేటాయించిన రూ.1500 కోట్లు చెల్లించాలి



మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ తదితరులు

కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ ఆర్టీసీకి కేటాయించిన రూ.1500 కోట్లను తక్షణమే చెల్లించాలని తెలంగాణ స్టేట్ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమండ్ చేస్తూ.. వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ఒక రోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. అనంతరం సుద్దాల సురేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

- ప్రభుత్వం నుంచి రావాల్సిన రియంబర్స్‌మెంట్ రూ. 670 కోట్లు చెల్లించాలని డిజిల్ రేట్లపై వ్యాట్‌ను ప్రభుత్వమే భరించాలన్నారు.
- కొత్త బస్సులు కొని మెరుగైన సేవలు అందించాలని బ్యాగ్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.
- కండక్టర్స్, డ్రైవర్లకు ఉద్యోగ భద్రత, యూనిఫాం, పనిముట్లు ఇవ్వాలని రిటైర్డ్ అయిన కార్మికులకు సెటిల్‌మెంట్ చేసి కారుణ్య పథకాల్ని వెంటనే అమలు చేయాలన్నారు. లేని పక్షంలో అన్ని యూనియన్లు, కార్మికులతో కలిసి ఐక్య పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రిలే నిరాహార దీక్షలో యూనియన్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, కుమార్, సురేఖ, జయశంకర్, గీతారాణి, రేణుక, రవీందర్, నాగేష్ తదితరులతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి



కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: డివిజన్ పరిధిలో ఉన్న పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అధికారులకు సూచించారు. మంగళవారం డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె అభివృద్ధి పనులపై చర్చించారు. రోడ్లపై ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని వర్షాకాలం ప్రారంభమవుతున్న సందర్భంగా నాలాల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలని సూచించారు. ఏఈ కార్తిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము తదితరులున్నారు.

డెంగీ వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన



బాగ్‌అంబర్‌పేట్‌లో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి



గోల్నాక అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ లావణ్య

అంబర్‌పేట: డెంగీ వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. దోమల నివారణకు పిచికారి చేయించారు. ప్రజలు దోమలకు ఆవాసాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గోల్నాకలో..

- అంబేద్కర్‌నగర్‌లో జాతీయ డెంగీ నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించి డెంగీ పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ లావణ్య శ్రీనివాస్ గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన గుర్తు తెలియని వ్యక్తిపై కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాక, విజయపురికాలనీకి చెందిన సర్వేశ్వర్ రావు భార్య సుచిత్ర (25) న్యాయవాది. కాగా రాజమండ్రి – కాచిగూడ రైల్లో కాచిగూడకు వస్తుండగా.. గుడివాడ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి బోగిలోకి దూసుకొచ్చి నిద్రిస్తున్న సుచిత్రపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె ప్రతిఘటించగా పారిపోయాడు. మంగళవారం రాత్రి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ నిమిత్తం గుడివాడ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలి చేసినట్టు సమాచారం.

కవిత్వం సమాజానికి ప్రయోజనకారి కావాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: కవిత్వం సమాజానికి ప్రయోజనకారి కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం తెలంగాణ కవుల సంఘం, బీసీ టీచర్స్ యూనియన్, కళాసూర్య సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో సుతారపు వెంకట్‌నారాయణ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం జరిగింది. గౌరవ అతిథిగా కాళోజీ అవార్డు గ్రహీత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాలేశ్వరం శంకరం, కళాసూర్య కల్చరల్ సంస్థ వ్యవస్థాపకులు అనుముల ప్రభాకార చారి, తెలంగాణ కవుల సంఘం రాష్ట్ర కోశాధికారి దొంతరబోయిన దైవాదీనం తదితరులు పాల్గొన్నారు. ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కవులు సమాజానికి మార్గనిర్దేశకత్వాన్ని అందించాల్సిన అవసంరం చాలా ఉందన్నారు. కవిత్వం మారుతున్న కాలానికి అనుగుణంగా పరిణామక్రమంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కవులు పొన్నం రాజయ్యగౌడ్, గుజ్జ కృష్ణ, శ్యామాచారి, పోచం సుజాత, విజయలక్ష్మి, వేమూరి ప్రేమలత, కొమ్ము వర లక్ష్మి, విజయ్, ఎం.నారాయణరెడ్డి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు



తల్లులకు పాదపూజ చేసిన విద్యార్థులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: శ్రీ రాగ రమ్య కల్చరల్ అండ్ సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాతృ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం నీరు ఠాగూర్ బృందంచే తల్లి గొప్పతనాన్ని తెలియజేసే పాటలు, ఉపన్యాసాలు జరిగాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం పలువురు మహిళలను సన్మానించి బహుమతులను ప్రదానం చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు రమ్య నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్వప్న, పుష్పలత, ప్రసన్నకిరణ్ తదితరులున్నారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

కాచిగూడ: విద్యార్థులు అంకితభావం, క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని అవంతి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వీరసోమయ్య అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వై.జయప్రద అధ్యక్షతన మంగళవారం విద్యార్థులు 'మాతృవందనం' నిర్వహించారు. తల్లులకు కాళ్లు కడిగి పూలు, పసుపు, కుంకుమ, గంధంతో హారతులిచ్చి గౌరవ సత్కారం చేశారు. విద్యార్థినీవిద్యార్థులు తల్లులపై వ్రాసిన కవితలు చదివి, పాటలు పాడి, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అమ్మ గొప్పతనాన్ని చాటారు. ఆయన మాట్లాడుతూ.. అమ్మే ఆది గురువు, దైవమని అన్నారు. అమ్మ ఆప్యాయత అనురాగాలను మించినది ఏదీ లేదని అటువంటి తల్లిని గౌరవించి ఆమె ఆశీర్వాదం పొందాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థి దశలో వ్యసనాలకు అలవాటు పడకుండా చదువుపైనే ధ్యాస పెట్టాలని సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ.. మంచి స్నేహితులను కలిగి ఉండాన్నారు. ఉన్నత విద్యతో సమాజంలో ఆదర్శంగా నిలవడానికి విద్యార్థులు కృషి చేయాలని కోరారు. డైరెక్టర్ డాక్టర్ వెంకట్‌రావు, శిష్లా మాధవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



లబ్ధిదారులతో ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్లు

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ముషీరాబాద్, హిమాయత్‌నగర్ మండల పరిధిలో కల్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మొత్తం 74 మందికి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మానస పుత్రిక కల్యాణలక్ష్మీ పథకం అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. హిమాయత్‌నగర్ తహసీల్దార్ చంద్రకళ, యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, గాంధీనగర్, కవాడిగూడ, రాంనగర్, ముషీరాబాద్ డివిజన్‌ల కార్పొరేటర్లు పావనీవినయ్‌కుమార్, రచనశ్రీ, రవిచారి, సుప్రియానవీన్‌గౌడ్, అధికారులు కృష్ణ, మధు, బీఆర్ఎస్ నాయకులు ముఠా నరేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీనివాస్‌గుప్తా, గుండు జగదీశ్‌బాబు, దామోదర్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, పాశంరవి, రవిశంకర్‌గుప్తా, శ్రీకాంత్, ముఠా శివసింహ, పీఎస్ శ్రీనివాస్, బత్తుల కిరణ్‌కుమార్, వెంకటేష్, భాస్కర్, శ్రీధర్‌రెడ్డి, ముచ్చకుర్తి పద్మ, తుడుం లక్ష్మి, బీజేపీ నాయకుల వినయ్‌కుమార్, నవీన్‌గౌడ్, ఉమేశ్ తదితరులున్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే ముఠాగోపాల్



ముషీరాబాద్: దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. వందేళ్ల చరిత్రగల ప్రసిద్ధిగాంచిన మహంకాళి దేవాలయ నూతన చైర్మన్, ధర్మకర్తల ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాదాయశాఖ ఈఓ ఆండాలు, వెంకటేశ్వర్‌నాయుడు, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్ యాదవ్‌లతో కలిసి నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి దేవాలయంలో దీప, దూప, నైవేద్య కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రెండోసారి ఆలయ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఎయిర్‌టెల్ రాజు ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శ్రద్ధ వహించారని కొనియాడారు. ఆలయ కమిటీ చైర్మన్ ధర్మకర్తలు పూజ గోరక్‌నాథ్, సదాముదిరాజ్, రూపాదేవి, రాజు, కమలాకర్‌రెడ్డి, రామకృష్ణలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, నవీన్, శివముదిరాజ్, భోలక్‌పూర్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, కె.నర్సింగ్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శులు అరవింద్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రెబ్బరామారావు, సంగిశెట్టి రాజ్‌కుమార్, శ్రీధర్‌చారి, ముచ్చకుర్తి ప్రభాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నూతన భవనం పరిశీలిన..

- భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ ప్రాంగణంలో డాక్టర్ విజయ్‌కుమార్ దాట్ల ఫౌండేషన్, బీఈ కంపెనీ, ఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని ఎమ్మెల్యే ముఠాగోపాల్, డీబీహెచ్, ఎఫ్‌డబ్ల్యూ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. బీహెచ్ఎస్ భాగ్యలక్ష్మి, ఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, శివరాణి, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీపై చర్యలు తీసుకోవాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మహిళా రెజ్లర్స్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ బ్రిజేష్ భూషణ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని సుందరయ్య పార్కు వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ భూషణ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ.. 'ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్స్ నిరసన తెలుపుతుంటే కేంద్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందని విమర్శించారు. వారి పోరాటాలకు మద్దతుగా కిసాన్ సంయుక్త మోర్చా ఉంటుందని స్పష్టం చేశారు. నాయకులు పశ్య పద్మ, ప్రభాకర్, వెంకటయ్య, బిక్షపతి, శోభన్ నాయక్, వెంకట్రాములు, ధర్మా నాయక్, అరుణజ్యోతి, నాగయ్య, సైకిలాబ్ బాబు, శ్రీరాం నాయక్, విజయ్, ప్రదీప్, రాంబాబు తదితరులున్నారు.

కాచిగూడ: భారత జాతీయ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు ప్రేమ్ పావని బీజేపీ ఎంపీ బ్రిజేష్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపించి మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం నారాయణగూడలో సంతకాల సేకరణ చేపట్టారు. భారత జాతీయ మహిళా సమాఖ్య హైదరాబాద్ జిల్లా సమితి ప్రతినిధులు ఎస్.ఛాయాదేవి, నళిని, షహనా అంజుమ్, శ్రీదేవి తదితరులున్నారు.